# గౌతమీగాథలు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

## వ్యసనైకమత్యం

స్టాండులో బస్సు దిగి టౌనులోకి వెడుతున్న నేనూ, బజారునుంచి ఇంటికి వస్తూన్న ఆయనా, పాల్‌చౌకుదగ్గర తలవని తలంపుగా తటస్థపడ్డాం.

పలకరింపుగా నవ్వాను. అది చూసి ఠక్కున నవ్వారు భమిడిపాటి కామేశ్వరరావుగారు- బోలెడు ఆశ్చర్యపడి కొయ్యబారిపోయాను.

ఎందుకంటారా ?—

వినండి !

గుత్తులుగా, బొత్తులుగా, ఆయన ఎన్ని హాస్య రచనలు చేసినా, ప్రసంగాలు చేసినా తప్తే నవ్వరు.

అతి సీరియస్- హైస్కూల్లో పేరుపడ్డ లెక్కల మాస్టరు ! ఒకసారి ఆయన మంచి 'మూడ్'లో వుండగా అడిగాను, 'అయ్యా, పెదవిమీదకు ఒక్క చిరునవ్వు రేక చిందకుండా అంత హాస్యప్రసంగం ఎలా చెయ్యగలరండీ !' అని అంటే, కొంటెగా అయ నన్నారు : 'తింటూ వడ్డిస్తే ఏం బావుంటుంది చెప్పండి. నేను హాస్యం వడ్డిస్తూన్నప్పుడు ఆ తిన్నవాడు తృప్తిగా నవ్వితే అదీ మనకు విజయం!' 'మహ గడుసు !'

అయితే— ఇప్పుడు అంత అపూర్వంగా అచ్చంగా- అంత నవ్వు ఎందుకు నవ్వినట్టు ?

అదే మనవి చేస్తున్నాను. బరంపురం లేతకీ ఖారా మసాలాతో గారపట్టిన నా పళ్లు బాగా లేవని— ఒక డెంటిస్టు తగిల్తే— అంతకు నాలుగు రోజులక్రితం యంత్ర దంత ధావనం చేయించాను. నవ్వితే నా పళ్లు మెరిశాయి. కామేశ్వరరావుగారూ, లేతకీ సేవనం చేసి చేసి గారపట్టిన తమ పళ్లకున్నూ — సరిగ్గా వారం రోజుల కిందట యంత్ర ధావనం చేయించారు. పళ్లు ముత్యాల్లా వున్నాయి. నేను కనపడితే నన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేయాలనుకున్నారట !

తీరా నన్ను చూసి ఆయనే ఆశ్చర్య పడిపోయారు. ఖులాసాగా కొంతసేపు కబుర్లు చెప్పుకున్నాం. ఆ సంభాషణ చివర హఠాత్తుగా యిలా అన్నారు. "చూశారూ ఈ తెల్లపళ్ల ఆనందం అట్టే కాలం నిలిచేలా లేదు. పళ్లు తెల్లగా వుండాలంటే— ఖారాకిల్లీ వెయ్యకూడదు, పొగపీల్చవచ్చు. ప్రశస్తమైన లంకాకుచుట్టలు తెచ్చి ప్రయత్నించి చూశాను.

రాత్రి భోజనాలయాక ఒక చుట్ట వెలిగించి తృప్తిగా పీల్చి-ఆ సుఖంతో నిద్రిద్దామంటే. మా శ్రీమతి శ్రోత్రియుల ఇంటిబిడ్డ. పొగచుట్ట శ్రీగంధం మైలు దూరంనుంచి పసిగట్టగలదు. కనక ఏలకులు. లవంగాలు మిశాయించి నమిలి ముఖశుద్ధి చేసుకుని. అంతఃపురంలో అడుగుపెట్టాలి. ఈ యాతన పడలేక చుట్ట మానేద్దాం— కూటికా ? గుడ్డకా ? అని మొరాయించి మానేశాను.

రెండు రోజులు గడిచాయి.

ఉత్సాహం పోయింది. ఊహ పెకలదే ? కలం పట్టుకుంటే జారిపోయింది. కణకణ వెలిగే మనస్సు నీళ్లు జల్లినట్టు ఆరిపోయింది.

మహ చెడ్డ కోపం వొచ్చింది.

చుట్టా కాల్చక, సిగరెట్టూ పీల్చక, మొగలిపూల పసందు కారాకిల్లీ నమలక మరి యెందుకు బతికినట్టు ?

రేపుదయం నుంచి "నిటలాక్షుం డిపుడెత్తి వచ్చినను రానీ" నాలుగు చుట్టలూ, అగ్గిపెట్టా జేబులో వేసుకుని. వరదరావు కాఫీహోటల్లో సుష్టుగా తిని చుట్ట వెలిగించి గుప్పు గుప్పున యింజనులా పొగ వొదులుతూ గోదావరిస్టేషనుదాకా నడవాలి. అప్పుడు ఊళ్ళో పెద్దమనుషుల ఎదుట చుట్ట కాల్చలేని నా మొహమాటమూ పోతుంది. నా స్థాయికి చుట్ట తగదేమో అన్న బితుగూ పటాపంచలవుతుంది. అని ఒకసుముహూర్తాన నిశ్చయించి-మర్నాడు ఉదయం తెల్లారగానే హోటలకు వెళ్ళి శుభ్రంగా కావలసింది తిని కాఫీ తాగి వీధిలో కొచ్చి జేబులోని ఆయుధసామగ్రిని పలకరించి ధైర్యంగా ఒకచుట్ట తీసి వెలిగించబోతూండగా శ్రీపాద కామేశ్వరరావుగారు ట్రైనింగ్ కాలేజీ లెక్చరర్ హోటలులోకి వెడుతూ ఎదురై- "అప్పుడే కాఫీ అయిందా, కామేశ్వరరావుగారూ !" అని పలకరిస్తే చుట్ట చప్పున జేబులోకి తోసేసి. ఏదోనండి, కొంచెం తొందరపని ఉండి.. అంటూ నసిగి ఈవలపడి అంత బజారుండగా ఇక్కడే తొందరేల ? అని నాళంవారి సత్రందాకా వచ్చి మళ్లా చెయ్యి జేబులో పెట్టాను. ఇంతలో ఎక్కడి నుంచి వూడిపడ్డాడో మా స్కూలు ఎస్. ఎస్. ఎల్. సి. కుర్రాడు నమస్కారం మేష్టారూ ! మాకు రేపు ప్రైవేట్ క్లాసుందాండి ? అంటూ సాక్షాత్కరించాడు. వీడు రేపు స్కూల్లో నా చుట్టసంగతి టాంటాం చెయ్యొచ్చు. చేసింది గుంఫనగా చేద్దాం. వీణ్ణి దాటిపోనీ అనుకుని నవ్వు వెలవెల పోనివ్వకుండా జాగ్రత్తపడి వాణ్ణి పంపేసి ముందుకు నడిచాను.

పెద్ద మసీదు దాటింది,
కూరల మార్కెట్టు కడచింది.
పౌరుషం ముంచు కొచ్చింది.
గోదావరి స్టేషన్ కనపడుతోంది.

చర్రున చుట్టతీసి వెలిగించాను. అలవాటు లేక ఇంకా బాగా అంటుకో లేదు. కసితీరా పొగ లోపలికి లాగి ఒదలాలి. 'ఇదిగో భమిడిపాటివారు ! రైలుకా ? ఆర్యాపురం వైపా ?' అంటూ కవిసార్వభౌమ శ్రీ కృష్ణమూర్తిశాస్త్రిగారు ప్రత్యక్షమయ్యారు.

చచ్చినంత పనయింది. అంతటివాడు చుట్టతో నన్నుచూస్తే ఇంకేమయినా ఉందా చుట్ట పక్కకు జార్చేసి ఏదో సమాధానం చెప్పి బయటపడి— ఇంక మనకు చుట్టయోగం లేదు, అని గోదావరిగట్టున నడుస్తూ- చుట్టలు, అగ్గిపెట్టె విసిరి గోదావర్లో పారేశాను.

అని కథ ముగించేసరికి కామేశ్వరరావుగారూ, నేనూ మంచి సెంటర్లో కొచ్చాం. పక్క- కిల్లీకొట్టు దగ్గర ఆగి కామేశ్వరరావుగారు కసిదీరా బంగాళా ఆకుతో కారా కిల్లీలు రెండు బందోబస్తుగా కట్టించి ఒకటి నాకిచ్చి, తా మొకటి బిగించి నవ్వుతూ "ఇక పదండి" అన్నారు.